క్లుప్తంగా

పశువులకు సకాలంలో పరీక్షలు చేయాలి

కరప: పాడిపశువులకు మేత సక్రమంగా తినకపోయినా, పాలు ఇవ్వకపోయినా, యెదకు రాకపోయినా సకాలంలో వైద్యపరీక్షలు చేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్ తెలిపారు. మండలం అరట్లకట్టలో శుక్రవారం పాడిరైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు వివరించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశు ఆరోగ్య శిబిరంలో 184 ఆవులు, గేదెలను వెటర్నరీ అసిస్టెంట్ సునీల్‌తో కలసి పరీక్షలు నిర్వహించి, రైతులకు మందులు అందజేశారు.

8న వేంకటేశుని దివ్య కల్యాణం



ప్రత్యేకాలంకరణలో యండమూరు వెంకన్న

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదా సమేత వెంకటేశ్వరస్వామివారి దివ్యకళ్యాణం ఈనెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వైఖానస ఆగమసిద్ధాంతం ప్రకారం నిర్వహించనున్నట్టు అర్చకులు పెద్దింటి సీతారామం తెలిపారు. ఆలయ అభివృద్ధి దాతలు రాజుపాలెం శ్రీ వెంకటేశ్వరా ట్రస్ట్, గ్రామస్తుల సహకారంతో దేవదాయశాఖ పర్యవేక్షణలో కల్యాణం ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ తెలిపారు. 15వ తేదీన అన్నదానం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు రాట ముహూర్తం చేశారు.

పీఏడీఏ పీడీగా శ్రీధర్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎన్.శ్రీధర్‌ను పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి (పీఏడీఏ) నియమిస్తూ కలెక్టర్ షణ్మోమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, పిఠాపురం ప్రాంతీయ అభివృద్ధి కోసం కలెక్టర్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు అధికారులను రీ డిప్లాయిమెంట్ విధానంలో నియమించారు.

ఆహార ధరలు నియంత్రించాలి

బోట్‌క్లబ్: నగరంలో మల్టీప్లెక్స్ థియేటర్లలో ప్రేక్షకుల జేబులు గుల్ల చేస్తున్న ఆహార ధరలు నియంత్రించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రేక్షకులు తమ వెంట తెచ్చుకున్న తాగునీరు, ఇతర అల్పాహారాలు లోపలికి తీసుకువెళ్లే అవకాశం కల్పించాలన్నారు. చిన్న, మధ్య తరగతి కుటుంబాలు థియేటర్‌కు వెళ్లే సినిమా చూసి, ఎమైనా తిందామంటే రేట్లు చూసి భయపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. థియేటర్‌లో ఇష్టానుసారంగా రేట్లు పెంచుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన

బోట్‌క్లబ్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని ఒక ఆసుపత్రిలో సర్వైకల్ కేన్సర్‌పై స్త్రీల వ్యాధుల వైద్య నిపుణురాలు అడబాల మాధవి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో అడబాల మాధవిని సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వీవీరావు, కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, కన్వీనర్ దీప, సభ్యులు పాల్గొన్నారు.

నేడు భూతకాలం నాటకం

బోట్‌క్లబ్: హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భూతకాలం నాటకం ప్రదర్శిస్తున్నట్టు దంటు కళాక్షేత్రం అధ్యక్షుడు దంటు భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాక్షేత్రం గౌరవ సలహాదారుగా పనిచేస్తు ఇటీవల మృతి చెందిన డీవీఎస్ శర్మ, ప్రముఖ సంగీత దర్శకులు జి.సర్వేశ్వరరావుకు నివాళులు అర్పిస్తూ ఈ నాటకం ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు.

రేపు ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా తృతీయ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏపీజీఈఏ అధ్యక్షులు ఎంవిఎస్ఎస్ఎన్ జగన్నాథం అధ్యక్షతన నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రమేష్‌కుమార్ పాల్గొంటారని, కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి జె.రాంబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు డీఏ రత్నరాజు పర్యవేక్షిస్తారని జిల్లా అధ్యక్షుడు జగన్నాథం తెలిపారు. మహాసభలో అత్యధిక సంఖ్యలో అన్ని శాఖల, అన్ని తరగతుల ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయలని కోరారు.

రక్షణ గాలికి..!

- కూలిన ఫ్లై ఓవర్ రెయిలింగ్
- గోడల్లో మొలుస్తున్న మొక్కలు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కాకినాడ లీగల్: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. వారి వైఖరితో కీలకమైన నిర్మాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నగరంలో ఎంతో కీలకమైన కాకినాడ వార్ఫు రోడ్డు నుంచి జగన్నాథపురం వెళ్లే ఫ్లైఓవర్ రెయిలింగ్ కూలిపోయింది. ఈ వంతెన రెయిలింగ్ పగుళ్ల నుంచి మొక్కలు మొలుస్తున్నాయి. చాలా కాలంగా రెయిలింగ్ నిర్వహణ కానీ, మరమ్మతులు కానీ చేయలేదు. ఈ వంతెనపై నిరంతరం భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. వేలాది వాహనాలతో పాటు, పాదచారులు సైతం దీనిమీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇది మరమ్మతులకు గురవుతున్నా అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వంతెన దెబ్బతింది. వంతెన రెయిలింగ్ బాగా దెబ్బతినడంతో కూలిపోయిందని స్థానికులు అంటున్నారు. రెయిలింగ్ కూలిన సమయంలో అక్కడ జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ పరిస్థితిపై నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రెయిలింగ్ నిర్మాణానికి చర్యలు తీసుకుని, బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికుల ఆందోళన

కాకినాడకు నలుమూలల నుంచి వచ్చేవారు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 30 వేల నుంచి 50 వేల మంది వాహనాలతో ప్రయాణిస్తుంటారు. ఇటువంటి బ్రిడ్జికి మరమ్మతులు చేయకపోవడం దారుణమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బ్రిడ్జి రెయిలింగ్ గోడపై పెరిగిన పిచ్చి మొక్కలు



ఫ్లైఓవర్‌పై కూలిపోయిన రెయిలింగ్

కొత్త రెయిలింగ్ నిర్మించాలి



బ్రిడ్జి రెయిలింగ్ పూర్తిగా శిథిలమై దెబ్బతింది. కొంతకాలంగా రెయిలింగ్ పక్క నుంచి మొక్కలు పెరిగిపోతున్నాయి. కార్పొరేషన్ సిబ్బంది ఏడాదికి ఒకసారి మొక్కుబడిగా ఆ మొక్కల కొమ్మలను నరికి వదిలేదస్తున్నారు. దీంతో మళ్లీ చిగురించి మొక్కలు ఏపుగా పెరిగిపోతున్నాయి. గోడల్లో పెరిగిపోతున్న ఈ మొక్కలను వేళ్లతో సహా తొలగించి మళ్లీ మొలవకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– జీఎస్ఆర్ కృష్ణారావు, స్థానికుడు

అధికారులు పట్టించుకోవాలి



బ్రిడ్జి రెయిలింగ్‌కు మరమ్మతులు చేయించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి రెయింలింగ్ పక్కన వస్తున్న మొక్కల తొలగింపునకు శాశ్వత చర్యలు చేపట్టాలి. అలాగే రెయిలింగ్‌ను పూర్తిగా తొలగించి పటిష్టంగా నిర్మించాలి.

– ఎస్‌వీ వెంకట రమణ, స్థానికుడు

రహదారి భద్రతపై అవగాహన



విద్యార్థులకు, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా ఉప కమిషనర్ శ్రీధర్

బాలాజీచెరువు: రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ మైదానంలో రవాణా ఉపకమిషనర్ కె.శ్రీధర్ అంబులెన్స్ డ్రైవర్లు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు. అలాగే రహదారుల గుర్తులు గుర్తించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదంలో ఒక ప్రాణం పోతే దాంతో ఆ కుటుంబమే రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఉప కమిషనర్ శ్రీధర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ న్యూరో హెచ్‌వోడీ డాక్టర్ విజయ్‌శంకర్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.హరినాథ్‌రెడ్డి, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.సాయిబాబు, రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ వి.పద్మావతి విద్యార్థులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

స్వచ్ఛ కాకినాడ లక్ష్యం కావాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

- కమిషనర్ భావన
- పారిశుధ్య పనుల పరిశీలన

కాకినాడ: స్వచ్ఛ కాకినాడగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన కోరారు. శుక్రవారం ఆమె కాకినాడలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. జీజీహెచ్, బాలాజీచెరువు, మెయిన్‌రోడ్డు, దేవాలయం వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనుల తీరును ఆమె పర్యవేక్షించారు. చెత్త సేకరణ, వీటిని తప్పించే వాహనాల పనితీరును పరిశీలించారు. అనంతరం 14వ సర్కిల్ కరణంగారి సెంటర్ ప్రాంతంలో చెత్తను రోడ్లపై వేస్తున్న వారిని గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు కారణమైన మద్యం దుకాణదారునికి జరిమానా విధించాలని ఆదేశించారు. చెత్తను డస్ట్‌బిన్‌లలో కాకుండా రోడ్లుపై వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ సుధాకర్, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఫిల్టరేషన్ ప్లాంట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ భావన

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బంది రాకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె విక్టోరియా వాటర్ వర్క్స్‌లోని ఫిల్టరేషన్ ప్లాంట్‌ను పరిశీలించారు. శుద్ధి జరుగుతున్న తీరును పరిశీలించారు. నీటి స్వచ్ఛత, ఫిల్టర్‌బెడ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజులుగా నిరుపయోగంగా ఉన్న ఫిల్టరేషన్ ప్లాంట్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆమె వెంట ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ మత్సరాజు, డీఈ ఫణి తదితరులు ఆమె వెంట ఉన్నారు.

ఆదిశక్తి అవతారం వాసవీ మాత

కాకినాడ రూరల్: ధర్మాన్ని నిలిపేందుకు, మహిళల గౌరవాన్ని కాపాడడానికి, వైశ్యుల ఔదార్యాన్ని ప్రపంచానికి చాటేందుకు కలియుగంలో ఆది పరాశక్తి ఆర్య మహాదేవి అవతారంగా వాసవి మాత జన్మించారని వైశ్య ప్రముఖులు మాతంశెట్టి సతీష్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవి మాత ఆత్మ బలిదానదినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు ఆర్టీసీ సర్వీసు

ప్రారంభించిన డీఎం మనోహర్



బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ మనోహర్

కాకినాడ: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లే భక్తులు, ప్రజల కోసం కాకినాడ నుంచి రెండుసార్లు లైనర్ స్లీపర్ స్పెషల్ బస్సులు శుక్రవారం బయలుదేరాయి. డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ జెండా ఊపి ఈ బస్సులను ప్రారంభించారు. కాకినాడ నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరీ, కోణార్క్ మీదుగా ప్రయాగ్‌రాజ చేరుకుంటుందన్నారు. అక్కడ త్రివేణి సంగమంలో పవిత్రస్నానాలు పూర్తి అయ్యాక తిరుగు ప్రయాణంలో వారణాసి, గయ, బుద్ధగయ క్షేత్రాలను చూపించి ఫిబ్రవరి 9వ తేదీన కాకినాడ చేరుకుంటాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకరరావు, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో పీఆర్ విద్యార్థుల ప్రతిభ



పోటీలలో కప్ గెలుచుకున్న విద్యార్థులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో ఆ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీలను ప్రిన్సిపాల్ తిరుపాణ్యం ప్రారంభించారు. కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ డాక్టర్ డి.కిశోర్ కుమార్ అధ్యక్షత వహించారు. వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు జరిగాయి. బహుమతి ప్రదానానికి కాకినాడ మూడో పట్టణ సీఐ కె.సత్యనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు వీవీఎల్‌జీ వర్మ, రమణ, కె.దుర్గారావు, నెహ్రూ యువకేంద్ర వలంటీర్లు ప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలను ఖండిస్తూ మేల్‌నర్స్ హడావిడి

- ఖాళీ పత్రాలపై సంతకాల సేకరణ
- కాకినాడ జీజీహెచ్‌లో వివాదం
- చర్యలు తీసుకుంటామన్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్

కాకినాడ క్రైం: ఓ మేల్ నర్సు అత్యుత్సాహం కాకినాడ జీజీహెచ్‌లో ఉద్యోగుల మధ్య అలజడికి కారణమైంది. వివరాల్లోకి వెళితే, ఆసుపత్రిలో పోలాబత్తిన శ్రీనివాసరావు కాంట్రాక్టు మేల్ నర్సుగా పనిచేస్తున్నాడు. ఇటీవల కలెక్టర్ అందించిన రిపబ్లిక్ డే అవార్డుల వ్యవహారంలో ఆసుపత్రి అధికారులు పక్షపాత వైఖరి అవలంభించారని ఆరోపిస్తూ, అవార్డులు అందుకున్న వారిపైనా సామాజిక మాధ్యమాల వేదికగా కొద్ది ఆరోపణలు గుప్పించాడు. ఇతడి వ్యవహారంపై ఆసుపత్రి అధికారులు, సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేయగా తన సొంత నాయకత్వంలో ఈ సమస్యపై ముందుకు వెళతానని శుక్రవారం తనతో కొన్ని ఖాళీ పత్రాలు తెచ్చుకున్నాడు. వాటిపై పలువురు ఉద్యోగులతో సంతకాలు చేయించాడు. ఖాళీ పేపర్లపై సంతకాలు చేయించడంలో ఏపీ ఎన్‌జీవో, నర్సెస్ అసోసియేషన్, జీజీహెచ్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ మద్దతు తనకుందని ప్రచారం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయా సంఘాల నేతలు మండిపడ్డారు. నర్సింగ్ అసోసియేషన్ తరఫున నాయకులు విజయలక్ష్మి, ప్రమోద, జేఏసీ అధ్యక్షుడు మూర్తిబాబు, ఏపీ ఎన్‌జీవో జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణ శ్రీనివాసరావు వైఖరిని తీవ్రంగా ఖండించి ఖాళీ పత్రాలపై ఉద్యోగుల సంతకాలు తీసుకోవడాన్ని తప్పుబట్టారు. శ్రీనివాసరావు చర్యలకు తమ సంఘాలకు ఎటువంటి సంబంధం లేదని మూకుమ్మడిగా శుక్రవారం రాత్రి ప్రకటించారు. ఈ విషయంపై జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ స్పందిస్తూ ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకోవడం వివాదాస్పదమన్నారు. ఆసుపత్రి పరిధిలో వ్యక్తిగత మనస్పర్థలకు తావులేదన్నారు. ఉద్యోగులను తప్పుదారి పట్టిస్తే ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ పత్రాలపై సంతకాలు సేకరించిన మేల్ నర్సు వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు.

హెల్మెట్ ధారణ కుటుంబానికి శ్రేయస్కరం



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: హెల్మెట్ ధరించి ప్రయాణించడం వల్ల కుటుంబానికి శ్రేయస్కరమని నేషనల్ హైవే అథారిటీస్ ఇంజినీరు శ్రీనివాస్ పేర్కొన్నారు. అచ్చంపేట జంక్షన్ కూడలి వద్ద శుక్రవారం ఉదయం రహదారి భద్రతపై ఆర్వోఎస్ఎల్ ప్రాజెక్టు, జేపీ కన్‌స్ట్రక్షన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వాహనచోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చునని అన్నారు. పలువురు వాహన చోదకులను ఆపి వారితో హెల్మెట్ ధరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్వోఎస్ఎల్ ప్రాజెక్టు మేనేజరు అనంతరావు, కో ఆర్డినేటరు చక్కని ప్రభాకరరావు, జేపీ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహరావుకు జేఎన్‌టీయూకే పీహెచ్‌డీ



బాలాజీచెరువు: నిపుణుల బృందం సిఫార్సు మేరకు టి.నర్సింహారావు సిద్ధాంత వ్యాసం 'ఏ న్యూ అప్రోచ్ టు జనరేట్ సింప్లిఫైడ్ సొల్యూషన్ టు ద ఇంబ్యాలెన్స్ డేటా సెట్స్' జేఎన్‌టీయుకే అధికారులచే ఆమోద ముద్ర పొందింది. ఈయనకు కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగంలో పీహెచ్‌డీ లభించింది. టి.నరసింహరావు తన సిద్ధాంత వ్యాసాన్ని తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ హైదరాబాద్ సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.సుమతి పర్యవేక్షణలో సమర్పించారు.

24 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కాట్నా జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు . పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం ఈనెల 24వ తేదీ సోమవారం రాత్రి 8.32 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఆయన తెలిపారు. 25వ తేదీ మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి ఉత్సవం, 27వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నాకబలి, రథోత్సవం, 28న త్రిశూల స్నానం, స్వామివారి తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

పాదగయ క్షేత్రంలో మహా శివరాత్రి ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదనరావు అధికారులతో శుక్రవారం సమీక్షించారు. లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. పుణ్య స్నానాలకు ఏర్పాట్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చూడాలని, వివిధ శాఖలకు ఆయా బాధ్యతలను అప్పగించారు. ఆలయ ఈఓ కాట్నా జగన్మోహన్ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర నామా కనకారావు తదితరులు పాల్గొన్నారు.



పాదగయ క్షేత్రం

భీష్మ ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు

- దేవస్థానం, పోలీస్‌శాఖల సమన్వయంతో పలు నిర్ణయాలు

అన్నవరం: మాఘమాసంలో అత్యంత పవిత్రమైన భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 8న సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. భీష్మ ఏకాదశి, శనివారం కలిసి రావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దేవస్థానంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం దేవస్థానం, పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ ముఖ్య అతిథిగా హాజరైన సమావేశంలో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు ఇతర దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

భీష్మ ఏకాదశి ముందు రోజు సాయంత్రం నుంచే భక్తులు రత్నగిరికి తరలి వస్తారు. కావున ఆ రోజు నుంచి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ముందు రోజు అర్ధరాత్రి నుంచి సత్యదేవుని వ్రతాల నిర్వహణ, స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేస్తారు.

- క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందిస్తారు. మంచినీటి సరఫరా కోసం స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకుంటారు.
- ప్రసాదాల విక్రయాలకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఘాట్‌రోడ్‌లో ట్రాఫిక్ జామ్ అవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

భీష్మ ఏకాదశి రోజు ఉదయం 8 గంటల నుంచి సర్క్యులర్ మండపం వద్ద భక్తులకు దద్ధోజనం, పులిహోర పంపిణీ చేయనున్నారు.

- వసతి గదులు లభించని భక్తులు విశ్రాంతి మండపాల్లో విశ్రాంతి తీసునేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.
- దేవస్థానంలో పలు చోట్ల అదనపు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



సమావేశంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సుబ్బారావు, డీఎస్పీ శ్రీహరి రాజు

- కార్తికమాసంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా క్యూలైన్లలో కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేసినట్టే ఇప్పుడు కూడా భక్తుల కోసం కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయనున్నారు.
- రత్నగిరి, సత్యగిరుల మధ్య భక్తుల కోసం ఉచిత బస్సులు నడపాలని నిర్ణయించారు.

భక్తుల వాహనాలను ప్రకాష్ సత్రం వెనుక, సత్యగిరి దిగువన గల పార్కింగ్ స్థలాల్లో, సత్యగిరిపై హరిహరసదన్ పార్కింగ్ స్థలంలో నిలిపివేయాలని నిర్ణయించారు.

- జిల్లా వైద్యశాఖ, దేవస్థానం ఉచిత వైద్యశాల సిబ్బంది సహకారంతో దేవస్థానంలో మూడు చోట్ల మెడికల్ క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పలు నిర్ణయాలు తీసుకున్నారు.

బాలలతో భిక్షాటన చేయిస్తే నేరం

సామర్లకోట: బాలలతో భిక్షాటన చేయించడం నేరమని, అటువంటి వారిని గుర్తిస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సంచార జీవులు ఏర్పాటు చేసుకున్న గుడారాల వద్ద ర్యాలీతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ బాల్యం ఎన్నో జ్ఞాపకాలు ఇస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పాఠశాలలో పాఠాలు, ఆటలతో గడపాలన్నారు. రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, ఆటో స్టాండ్, పబ్లిక్ ప్రదేశాలు, ముఖ్య కూడళ్లలో భిక్షాటనలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం ఆరుగురు భిక్షాటన చేస్తున్న తల్లులతో బాలలను గుర్తించినట్టు తెలిపారు. ఈ మేరకు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సమీపంలోని పాఠశాలల్లో చేర్చేలా ఎంఈఓ పి.పుల్లయ్యకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన వారు తిరిగి భిక్షాటనలో కనిపిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించి వారి వద్ద నుంచి లిఖిత పూర్వకంగా లేఖ తీసుకున్నారు. కార్యక్రమంలో బాలల సంరక్షణాధికారులు కె.శ్రీనివాస్, జె.విజయ, సుధాకర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్లు బి.శ్రీనివాసు, చిన బాబు, దుర్గాభవాని, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవి, ఎంఈఓ 2 పి.పుల్లయ్య, క్రాఫ్ట్ ఎన్‌జీఓ సిబ్బంది పాల్గొన్నారు.